జ్వాల దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

శనివారం
31-10-2026

సంపుటి 1 | సంచిక 338

పేజీలు : 04

వెల : 1/-

PRGI No : TGTEL/25/A4195

విలేకరులు కావలెను

నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ | ఆర్.సీ.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ | క్రైమ్ రిపోర్టర్లు

7337546647
(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)



జనవరి నుంచి 8 నెలలు నీటి కష్టాలు!

రోజుకు 100 ఎంజీడీల నీటి కొరత ఏర్పడే అవకాశం

శేరిలింగంపల్లిలో 80 శాతం వరకు ఎద్దడి.. 3 లక్షల కనెక్షన్లపై ప్రభావం

దశ, హైదరాబాద్: వచ్చే ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు హైదరాబాద్ నగరానికి తీవ్ర నీటి ఎద్దడి ఎదురయ్యే అవకాశముందని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి హెచ్చరించారు. మంజీరా, సింగూరు జలాశయాల్లో నీటిమట్టాలు గణనీయంగా పడిపోవడంతో రోజుకు సుమారు 100 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీ) నీటి కొరత ఏర్పడనుందని తెలిపారు. భూగర్భ జలాలు తగ్గడం కూడా సమస్యను మరింత తీవ్రం చేస్తోందన్నారు. నీటి కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. గోదావరి నుంచి 100 ఎంజీడీలు, కృష్ణా నది నుంచి 10-15 ఎంజీడీలు, ఉస్మాన్‌సాగర్ నుంచి మరో 5 ఎంజీడీల నీటిని నగరానికి తరలించే ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ చర్యలతో కొరతలో కొంతమేర భర్తీ చేసినప్పటికీ 20 నుంచి 40 శాతం వరకు నీటి ఎద్దడి కొనసాగవచ్చని అంచనా వేశారు. నగరంలోని ఏడు నియోజకవర్గాలపై నీటి కొరత ప్రభావం అధికంగా ఉండొచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా శేరిలింగంపల్లిలో 80 శాతం వరకు నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. పటాన్‌చెరు నుంచి నార్సింగి వరకు సుమారు మూడు లక్షల నీటి కనెక్షన్లకు సరఫరాలో ఇబ్బందులు ఎదురుకావచ్చని తెలిపారు. నగరవాసులు ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వినియోగించాలని జలమండలి అధికారులు సూచిస్తున్నారు.



ఫోన్ మాట్లాడొద్దన్నందుకు

కన్నబిడ్డను హతమార్చిన తల్లి!

14 ఏళ్ల కుమార్తెను గొంతునులిమి చంపిన వైనం

ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం.. పోలీసుల విచారణలో వెలుగులోకి నిజం

దశ, కొత్తూరు: అతిగా ఫోన్ మాట్లాడుతోందని, చెప్పిన మాట వినడం లేదనే కోపంతో కన్నతల్లే 14 ఏళ్ల కుమార్తెను గొంతునులిమి హత్య చేసిన ఘటన షాద్‌నగర్ పరిధిలోని కొత్తూరు మున్సిపాలిటీ హనుమాన్ కాలనీలో చోటుచేసుకుంది. షాద్‌నగర్ డీసీపీ శిరీష వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆటోడ్రైవర్ ముయ్యడి రాజు, విజయలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె సువర్చల స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో

..మిగతా 4వ పేజీలో ➔



ప్రభుత్వం కూలే వరకు పాదయాత్ర ఆపను

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తరలింపుపై బీజేపీ ఎంపీ పట్టు

డీపీఆర్ ఇస్తే ప్రధాని మోదీతో మాట్లాడి నిధులు తెస్తా: ఈటల

దశ, హైదరాబాద్: జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు డిమాండ్‌తో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్ర కొనసాగుతోంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. డంపింగ్ యార్డ్ తరలించే వరకు మాత్రమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వం కూలిపోయే వరకు తన పోరాటం ఆగదని వ్యాఖ్యానించారు. పాదయాత్రపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలకు స్పందిస్తూ.. ప్రభుత్వం కూలే వరకు ప్రజల్లోనే ఉంటానని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డ్ రీసైక్లింగ్‌కు అయ్యే ఖర్చుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని ఈటల డిమాండ్ చేశారు. డీపీఆర్ అందిస్తే ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడి అవసరమైన నిధులు తీసుకొస్తానని ప్రకటించారు. నిధులు తీసుకురావడంలో విఫలమైతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్

..మిగతా 4వ పేజీలో ➔

రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కాపాడాం

మియాపూర్ 550 ఎకరాల భూమి విలువ రూ.50 వేల కోట్లు

భూముల విక్రయ ఆదాయాన్ని విద్య, వైద్యం, సాగునీటికి వినియోగిస్తాం

బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీకి వచ్చి చర్చించాలి.. రేవంత్‌రెడ్డి సవాల్



దశ, న్యూఢిల్లీ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రూ.1.5 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను పరిరక్షించినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మియాపూర్‌లోని 550 ఎకరాల భూమి విలువ సుమారు రూ.50 వేల కోట్లు ఉంటుందని తెలిపారు. ఈ భూమిపై సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వ భూముల పరిరక్షణ, గతంలో జరిగిన భూ లావాదేవీలపై పలు వ్యాఖ్యలు చేశారు. మియాపూర్ భూముల వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌పై సీఎం ఆరోపణలు చేశారు. ఈ లావాదేవీల్లో లగ్జరీ కార్లు, నగదు రూపంలో ముడుపులు చేతులు మారాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే పోరాడుతున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూములను పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ అటవీ భూములు, మంచిరేవులలోని 143 ఎకరాలు సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాపాడినట్లు సీఎం వివరించారు. ఈ భూముల వ్యవహారాల్లో కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందని ఆరోపించారు. మంచిరేవుల భూముల్లో ప్రస్తుతం పోలీసుల పిల్లల కోసం పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల

..మిగతా 4వ పేజీలో ➔

నగదు రూపంలో ముడుపులు చేతులు మారాయి. ఈ వ్యవహారంపై నేను ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే పోరాడుతున్న. సుప్రీం తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూములను పరిరక్షించేందుకు తక్షణ అధికారులు చర్యలు తీసుకోవాలి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ఆధార్, పాన్ కార్డుల్లో అక్రమ మార్పులు

జిరాక్స్ షాపు ముసుగులో నకిలీ కార్డుల తయారీ

4లో

షాపు నిర్వాహకుడు అరెస్ట్.. రూ.300 నుంచి రూ.1,000 వరకు వసూలు

పలు ఆహార తయారీ సంస్థలలో తనిఖీలు



తొమ్మిది సంస్థల లైసెన్సుల సస్పెండ్

దశ, హైదరాబాద్: తెలంగాణలో ఆహార తయారీ కేంద్రాలపై టీజీ సేఫ్ కొరడా ఝుళిపించింది. తొమ్మిది సంస్థల లైసెన్సులను సస్పెండ్ చేసింది. వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి జిల్లాల్లో 20 ఆహార తయారీ కేంద్రాలపై తనిఖీలు జరిగాయి. తుప్పుపట్టిన యంత్రాలు, పురుగులు, ఎలుకల సంచారం.. అపరిశుభ్రత మధ్య ఆహార తయారీ కావడం గుర్తించారు. 5,555 కిలోల ఆహార పదార్థాలు సీజ్ చేసారు. రూ.5.89 లక్షల విలువైన సరుకు స్వాధీనం చేసుకున్నారు. 21 ఆహార నమూనాలు సేకరించారు. తొమ్మిది 9 సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేసారు. నిబంధనల ఉల్లంఘనతో 9 సంస్థల ఆహార లైసెన్సులు సస్పెండ్ చేసారు. వ్యాపార కార్యకలాపాలు తక్షణమే నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఒక్క రమేష్ ఇండస్ట్రీస్‌లోనే 5,045 కిలోల ఆహార పదార్థాలు సీజ్ చేసారు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవనిహెచ్చరించారు.

ఆస్ట్రేలియాకు తాండూరు కందిపప్పు!

తొలిసారిగా 2.5 మెట్రిక్ టన్నుల ఎగుమతి

తెలంగాణ జీఐ ఉత్పత్తికి అంతర్జాతీయ గుర్తింపు.



దశ, తాండూరు : తెలంగాణకు చెందిన భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) పొందిన తాండూరు కందిపప్పు తొలిసారిగా ఆస్ట్రేలియాకు ఎగుమతి అయింది. మొత్తం 2.5 మెట్రిక్ టన్నుల కందిపప్పుతో కూడిన తొలి సరుకును తాజాగా ఆస్ట్రేలియాకు పంపించారు. ఈ పరిణామం తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న ఆదరణకు నిదర్శనంగా నిలిచింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల

..మిగతా 4వ పేజీలో ➔

సబ్జెక్టులో ఫెయిలైనా పదో తరగతి పాస్ కావొచ్చు!

2027-28 విద్యాసంవత్సరం నుంచి సీబీఎస్ఈలో కొత్త విధానం

స్కిల్ సబ్జెక్టులో ఉత్తీర్ణతతో ప్రధాన సబ్జెక్టు ఫెయిల్‌కు వెసులుబాటు

దశ, హైదరాబాద్ : సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షల విధానంలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. 2027 28 విద్యాసంవత్సరం నుంచి అమల్లోకి వచ్చే కొత్త విధానం ప్రకారం.. గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం సబ్జెక్టుల్లో ఏదైనా ఒకదానిలో ఫెయిలైనా, అదనంగా ఎంచుకున్న గుర్తింపు పొందిన నైపుణ్య ఆధారిత (స్కిల్) సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధిస్తే పాస్ అయినట్లు పరిగణిస్తారు. ఈ మేరకు సీబీఎస్ఈ అక్టోబరు 29న స్పష్టత ఇచ్చింది. కొత్త విధానంలో విద్యార్థులు రెండు భాషలు, గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం కలిపి ఐదు తప్పనిసరి సబ్జెక్టులకు బోర్డు పరీక్షలు రాయాలి. అదనంగా ఒక స్కిల్ సబ్జెక్టును ఎంచుకోవచ్చు. మూడో భాష, కళా విద్య, శారీరక విద్య, ఆరోగ్యం, వృత్తి విద్యతో కలిపి మొత్తం తొమ్మిది పాఠ్యాంశాలను అభ్యసించాలి. బోర్డు గుర్తించిన 22 స్కిల్ సబ్జెక్టుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫైనాన్షియల్ మార్కెట్స్, హెల్త్‌కేర్ తదితర అంశాలు ఉన్నాయి. వీటిలో ఎంచుకున్న సబ్జెక్టుకు పదో తరగతిలో బోర్డు పరీక్ష నిర్వహిస్తారు. ఉత్తీర్ణులైన వారికి మార్కులు, గ్రేడ్లతోపాటు నేషనల్ స్కిల్స్ క్వాలిఫికేషన్స్ ఫ్రేమ్‌వర్క్ కింద నైపుణ్య ధ్రువీకరణ పత్రం అందిస్తారు. అయితే ఈ వెసులుబాటు కౌశల్ వికాస్ సబ్జెక్టుకు వర్తించదు. వృత్తి విద్యను తప్పనిసరి పాఠ్యాంశంగా కొనసాగిస్తూ సీబీఎస్ఈ రెండు మార్గాలను అందిస్తోంది. కౌశల్ వికాస్ ఎంచుకున్న విద్యార్థులకు పాఠశాల స్థాయిలో అంతర్గత

..మిగతా 4వ పేజీలో ➔

ఎల్‌నినోను సమిష్టిగా ఎదుర్కొందాం





చౌటుప్పల్‌లో తాగునీటి అవసరాలకు రూ.85 లక్షల కేటాయింపు
కౌన్సిల్ సమావేశంలో రూ.2.28 కోట్ల అభివృద్ధి, నిర్వహణ పనులకు ఆమోదం

దశ, చౌటుప్పల్ : రానున్న ఎల్‌నినో ప్రభావంతో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చౌటుప్పల్ పురపాలక సంఘం నిర్ణయించింది. ఇందులో భాగంగా తాగునీటి అవసరాల కోసం రూ.85 లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా సమిష్టిగా కృషి చేస్తామని చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ తెలిపారు. శుక్రవారం చౌటుప్పల్ మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశంలో కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కొత్త బోర్లు వేయడం, మోటార్లు, పైప్‌లైన్లు ఏర్పాటు చేయడం, ప్రైవేటు బోర్లను లీజుకు తీసుకోవడం, అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం వంటి పనులను చేపట్టాలని నిర్ణయించారు. అదేవిధంగా వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, ఊర చెరువు పూడికతీత తదితర అభివృద్ధి పనులకు రూ.1.06 కోట్లకు పైగా, మున్సిపల్ కార్యాలయ సాధారణ పరిపాలన, నిర్వహణ, ఇతర అవసరాలకు రూ.28.27 లక్షలు కేటాయించారు. మొత్తంగా రూ.2.28 కోట్ల నిధుల వినియోగానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడం, చౌటుప్పల్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు చైర్‌పర్సన్ పేర్కొన్నారు.

ఈ సమావేశంలో కౌన్సిలర్లు కోసనం రాకేష్ రెడ్డి, పాలేపల్లి లక్ష్మి, పల్లె లావణ్య, ఉడుతల యాదయ్య, కొయ్యడ శేఖర్, ఆరె శైలజ, కాసర్ల మంజుల, బట్టి గాలయ్య, దేవి రమ్య, పాక చిరంజీవి, బత్తుల వాణి, ఉడుగు జ్యోతి, గడ్డం ఇందిర, బత్తుల జయమ్మ, చింతల ఉమామహేశ్వరి, బుడ్డ సురేష్, పిల్లలమర్రి మధుసూదన్, హనుమ మహమ్మద్, కోఆప్షన్ సభ్యులు పస్తం గంగారాములు, సందగట్ల విజయ, షేక్ సబీనా పాల్గొన్నారు. వివిధ శాఖల నుంచి డాక్టర్ డి. చంద్రశేఖర్ (ఆరోగ్య శాఖ), ఎం. గోవర్ధన్ (అటవీ శాఖ), బి. నవీన్ (ఆర్ అండ్ బీ), జి. శ్రీలక్ష్మి (ఐ అండ్ కాడ్), ఇ. గురువారావు (విద్యాశాఖ), లక్ష్మీనారాయణ (మిషన్ భగీరథ) తదితర అధికారులు హాజరయ్యారు.

బాటసింగారం వద్ద కారు దగ్ధం

- హైవేపై ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా చెలరేగిన మంటలు
- తృటిలో తప్పిన ప్రమాదం.. భార్యాభర్తలు సురక్షితం.



దశ, అబ్దుల్లాపూర్ మెట్: విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై బాటసింగారం గ్రామ పరిధిలో కారు అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైంది. ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఈ ఘటన చోటుచేసుకుంది. కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. విజయవాడకు చెందిన తాడేపల్లి ప్రవీణ్ (33) ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్యతో కలిసి హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 నియోస్ కారులో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా మార్గమధ్యంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. క్షణాల్లో మంటలు కారంతటా వ్యాపించడంతో స్థానికులు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కారు పూర్తిగా దగ్ధమైంది. అయితే మంటలు వ్యాపించేలోపే భార్యాభర్తలు బయటకు రావడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

విజిలెన్స్ వారోత్సవాల్లో అవినీతి నిర్మూలనపై అవగాహన



దశ, జనగామ: విజిలెన్స్ వారోత్సవం-2026లో భాగంగా జనగామ మున్సిపల్ కార్యాలయంలో గురువారం అవినీతి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వరంగల్ స్థాయి ఉప సంచాలకుడు పి. సాంబయ్య హాజరై అధికారులకు, సిబ్బందికి అవినీతి నిర్మూలనపై అవగాహన కల్పించారు. అక్టోబర్ 26నుంచినవంబర్ 1వరకునిర్వహిస్తున్నవిజిలెన్స్‌వారోత్సవాల్లో భాగంగా 'సత్యనిష్ఠతో సమృద్ధి' అనే అంశంపై ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధత, పారదర్శకత పాటించాలని సూచించారు. అధికారాలను వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించుకోకుండా,పక్షపాతంలేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. అవినీతి వల్ల ప్రజాధనం వృథా కావడమే కాకుండా, అభివృద్ధి పనులు, ప్రజా సేవలపై ప్రజలకు ప్రభుత్వ వ్యవస్థల పట్ల ఉన్న నమ్మకం దెబ్బతింటుందని వివరించారు.పారదర్శక పాలన, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ఆకస్మిక తనిఖీలు, ఫిర్యాదులపై తక్షణ చర్యల ద్వారా అవినీతిని అరికట్టవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే తెలంగాణ అవినీతి నిరోధక శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని సూచించారు.



పట్టభద్రుల ఓటు బాధ్యతగా వినియోగించుకోవాలి

- *పట్టా పొందడమే కాదు.. ప్రశ్నించే చైతన్యం ఉండాలి: ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు కల్లూరు ధర్మేంద్ర*

దశ ఓయూ: డిగ్రీ పట్టా పొందిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు విలువను గుర్తించాలని, హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు ఓటును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ ఘట్‌కేసర్ మండల సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఘట్‌కేసర్‌లోని పలు డిగ్రీ, పీజీ కళాశాలల్లో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు, అర్హులైన పట్టభద్రులకు ఫారం18 ప్రతులను అందజేసి నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, విద్యారంగ సమస్యలు, ఫీజుల భారం, సామాజిక న్యాయం వంటి అంశాలపై శాసనమండలిలో ప్రశ్నించే ప్రతినిధులను ఎన్నుకోవడంలో పట్టభద్రుల ఓటుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలు, వ్యక్తిగత ప్రలోభాలకు అతీతంగా అభ్యర్థుల ప్రజా సమస్యలపై నిబద్ధతను పరిశీలించి ఓటు వేయాలని సూచించారు.ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రతి అర్హులైన పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని కోరారు. ఓటు వేయకుండా ఉండటం ద్వారా తమ సమస్యలను చట్టసభల్లో వినిపించే అవకాశాన్ని కోల్పోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఘట్‌కేసర్ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గిరిబాబు, శివకుమార్, మహేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, పట్టభద్రులు మధు, లహరిక, సంగీత, అనిత, లావణ్య, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలి

- *బీఆర్ఎస్ నాయకులు పిలుపు*
- *పెద్ద అంబర్‌పేటలో సమావేశం, ప్రెస్‌మీట్.. పాత ఓటర్లు సైతం మళ్లీ నమోదు చేసుకోవాలి*



దశ, పెద్ద అంబర్‌పేట: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకులుపిలుపునిచ్చారు. శుక్రవారం పెద్ద అంబర్‌పేట డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించి, అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. 2023 అక్టోబర్ 31వ తేదీ నాటికి డిగ్రీ లేదా దానికి సమానమైన డిప్లొమా పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారితో పాటు గతంలో ఓటర్లుగా ఉన్నవారు కూడా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నవంబర్ 6, 2026 వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగనున్నందున అర్హులెవరూ ఈ అవకాశాన్ని కోల్పోవద్దని కోరారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు డివిజన్ పరిధిలోని ప్రతి గ్రామం, వార్డులో పర్యటించి పట్టభద్రులకు ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దండెం రాంరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఈదమల్ల బలరాం, మాజీ కౌన్సిలర్లు గౌని భాస్కర్ గౌడ్, పాశం అర్చన దామోదర్, దేసారం బాలకృష్ణ గౌడ్, మండల కోటేశ్వర్ రావు, తొండెపు రోహిణి బ్రహ్మానంద రెడ్డి, పిల్లి అమరావతి నాగేష్ యాదవ్, సీనియర్ నాయకులు పొగాకు నర్సింహ గౌడ్, గోషికొండ రాజిరెడ్డి, వెల్డింగ్ వెంకట్ రెడ్డి, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఇర్ఫాన్, పండుగుల రాము, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి అచ్యుత్, జోర్క రాము ముదిరాజ్, నాగరాజు, వెంకటేష్‌గౌడ్, యంజాల రాంబాబు, పండుగుల సత్యనారాయణ, జోర్రిగల మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సురేందర్‌నాథ్‌రెడ్డి సేవలు అభినందనీయం

- *వైద్య నిర్ధారణ రంగంలో 45 ఏళ్ల ప్రస్థానం.. ఘనంగా 77వ జన్మదిన వేడుకలు*



దశ, హైదరాబాద్ : వైద్య నిర్ధారణ రంగంలో డాక్టర్ సురేందర్‌నాథ్‌రెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. ఆయన 77వ జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన అభినందన సభలో 45 ఏళ్ల సేవలను గుర్తుచేసుకున్నారు. 1981లో ఒకే కేంద్రంతో ప్రారంభమైన విజయా డయాగ్నోస్టిక్స్ నేడు ఏడు రాష్ట్రాల్లోని 30 నగరాలకు విస్తరించి, సుమారు 170 కేంద్రాల ద్వారా ఏటా కోటి మందికి పైగా రోగులకు సేవలందిస్తోందని తెలిపారు. నాణ్యమైన వైద్య పరీక్షలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు 400 మందికి పైగా ఉద్యోగులకు కంపెనీలో వాటాలు కల్పించడం ఆయన ప్రత్యేకతగా పేర్కొన్నారు. బాలికల విద్య, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందిస్తున్న సహకారాన్ని కూడా ప్రశంసించారు. ఆయన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సాయిప్రసాద్ రెడ్డి, పలువురు ప్రముఖులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రైతుసంఘం జాతీయ మహాసభల్ని జయప్రదం చేయండి



దశ, మునగాల: అఖిల భారత రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు పిలుపునిచ్చారు.శుక్రవారం సుందరయ్య భవనంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సమావేశం చందా చంద్రయ్య అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు బుర్రి శ్రీరాములు మాట్లాడుతూ రైతు సంఘం 36వ జాతీయ మహాసభలు 2026నవంబర్ 15, 16, 17, 18 తేదీలలో నల్గొండ పట్టణంలో జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ మహాసభల సందర్భంగా నిర్వహించే బహిరంగ సభకు,మండలం నుండి రెండువేల మంది రైతులను తరలించనున్నట్లు ఆయన తెలిపారు. మహాసభల విజయవంతానికి గ్రామ గ్రామాన విస్తృత ప్రచారంనిర్వహించాలని ఆయన తెలిపారు.



దసరా గుడి చరిత్రలో సరికొత్త రికార్డు.. హుండీలో రూ.97,720

రికార్డు స్థాయిలో భక్తుల కానుకలు.. అమ్మవారి పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్

దశ, నార్కట్‌పల్లి: పట్టణంలోని స్థానిక బస్టాండ్ సమీపంలో దశాబ్దాలుగా భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తున్న దసరా గుడి శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారి హుండీని లెక్కించగా రూ.97,720 ఆదాయం సమకూరినట్లు ఆలయ నిర్వాహకులు వెల్లడించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి హుండీ ఆదాయం రికార్డు స్థాయికి చేరుకోవడం విశేషం. భక్తులు సమర్పించిన కానుకలతో సమకూరిన మొత్తాన్ని అమ్మవారి పేరు మీద బ్యాంకు ఖాతా ప్రారంభించి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సహకరించిన భక్తులు, పుర ప్రముఖులు, గ్రామ పెద్దలకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా దసరా గుడి టీమ్ సభ్యుల కృషిని అభినందించారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

ఐక్య పోరాటాల ద్వారానే రాజ్యాధికారం సాధ్యం

- *జాతీయ బిసి చైతన్య సమితి అధ్యక్షులు రమణ*

దశ, మునగాల: సమాజంలో అణిచివేతకుగురై, అధికారానికి ఆమడదూరంలో ఉంటూ దుర్భర జీవితాన్ని గడుపుతున్న బీసీలు, ఐక్యమై ముందుకు సాగుతూ అన్ని రంగాలలో అగ్రభాగాన నిలిచేందుకు రాజ్యాధికారం దిశగా పోరాడాలి అని జాతీయ బిసి చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బీసీ రమణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో జాతీయ బీసీ చైతన్య సమితి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు నాగార్జునపు రాజ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సూర్యాపేట జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగాహాజరై మాట్లాడుతూ, దేశ జనాభాలో 50% పైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో విద్యా ఉద్యోగ ఆర్థిక రాజకీయ రంగాలలో 50% రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కేంద్రంలో క్యాబినెట్ హోదాలో ప్రత్యేక బిసి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, 2027 జరిగే దేశవ్యాప్త జనాభా గణన లో ఓబీసీ కులగణన జరపాలని ఆయనకేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలో బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లు కోర్టు లు కొట్టివేయడం బాధాకరం అని, బీసీ రిజర్వేషన్లు పటిష్టతకోసం రాజ్యాంగాన్ని సవరించి షెడ్యూల్ 9లో బీసీ రిజర్వేషన్లు పెట్టాలని ఆయన సూచించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలన్నారు. బీసీల సమగ్ర అభివృద్ధి కొరకై బిపి మండల్ సిపార్సులు అమలు చేయాలని, దశాబ్దాల కాలం నుండి పరిష్కారం కానీ బీసీ డిమాండ్లపై బీసీలలో నాయకత్వాన్ని పెంపొందించుటకై విద్యార్థి యువజన మహిళ కమిటీలను గ్రామ గ్రామాన వేస్తూ బీసీ ఉద్యమ బలోపేతానికి కృషి చేస్తామని ఆయన అన్నారు. సందర్భంగా మునగాల,సూర్యపేట పట్టణ కమిటీలు ప్రకటించడం జరిగింది. ఈ కార్యక్రమంలోమహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగార్జునపు రాజ్యలక్ష్మి, సూర్యాపేట జిల్లా యువజన కార్యదర్శి సుంకరి నాగయ్య, చేన్నోజు ధనలక్ష్మి, సురోజు జ్యోతి, భోజనపల్లి గోవిందమ్మ, గుగ్గిళ్ళ సతీష్ చారి, కంబాల ధనలక్ష్మి, బెజ్జంకి చంద్రకళ, రాజరికం కళావతి, మారోజు ఈశ్వరమ్మ, సింగోజు శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

కొల్లాపూర్‌లో బీజేపీ భారీ ర్యాలీ, నిరసన



దశ, కొల్లాపూర్: రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో కొల్లాపూర్‌లో 'చలో కొల్లాపూర్' కార్యక్రమం నిర్వహించారు. కొల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్ రావు, రాష్ట్ర నాయకుడు ధారాసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పరిసర మండలాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీగా తరలివచ్చారు.ఈ సందర్భంగా ప్రధాన రహదారి మీదుగా కొల్లాపూర్ ఆర్టీసీ బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అక్కడ రైతులతో కలిసి నిరసన తెలిపారు. రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని, నిరంతరం 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం సర్వే నిర్వహించి ఎకరాకు రూ.20 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా ఎల్లేని సుధాకర్ రావు మాట్లాడుతూ రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్‌చేశారు.రైతులకు సాగునీరు,నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు పంట నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

ఛలో ఢిల్లీకి జనగామ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు

- *జెండా ఊపి బస్సును ప్రారంభించిన డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ లకావత్*



దశ, జనగామ: న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో నవంబర్ 1న నిర్వహించనున్న 'ఓట్ బచావో-దేశ్ బచావో' నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు జనగామ జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి బయలుదేరారు. జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ లకావత్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు.ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కుల రక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుంచి పార్టీ శ్రేణులు ఉత్సాహంగా తరలివెళ్లాయి. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ లకావత్ మాట్లాడుతూ..ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు.ఓటర్ల జాబితాలో అక్రమాలు, ఓటు హక్కుల హరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు.ప్రజాస్వామ్యవ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ఢిల్లీలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

గురుజాల రైతు వేదికలో ఖేతి బచావో అభియాన్



దశ, బెల్లంపల్లి: రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించడంతో పాటు నేల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని బెల్లంపల్లి మండల వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్ సూచించారు. బెల్లంపల్లి మండలం గురుజాల రైతు వేదికలో నిర్వహించిన 'ఖేతి బచావో అభియాన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేల సారవంతతను కాపాడుకోవడం భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సేంద్రియ పదార్థాల వినియోగాన్ని పెంచడం, పంట మార్పిడి పద్ధతులను పాటించడం, సమతుల్య ఎరువులను వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చని తెలిపారు. అలాగే నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.

మణుగూరు ఏరియాలో డైరెక్టర్ విస్తృత పర్యటన

- *ఓసీ గనులు, కోల్ బెంచ్‌ల పరిశీలన*
- *సింగరేణి ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సమష్టిగా శ్రమించాలి*
- *డైరెక్టర్ ఎల్.వి. సూర్యనారాయణ*



దశ, మణుగూరు: సింగరేణి సంస్థ నిర్దేశించిన వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేందుకు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో సమష్టిగా కృషి చేయాలని సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్. వి. సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మణుగూరు బొగ్గు గని ఏరియాలో విస్తృతంగా పర్యటించారు.ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్‌తో కలిసి ఓసీ4, ఓసీ2 గనుల వ్యూ పాయింట్లు, కోల్ బెంచ్, డంపర్ సెక్షన్‌లను సందర్శించి బొగ్గు వెలికితీత, ఓవర్‌బర్డెన్ (ఓబీ) తొలగింపు పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న భారీ యంత్రాలు, మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతిక సమస్యలతో ఉత్పత్తికి ఆటంకం కలగకుండా యంత్రాలకు ముందస్తు నిర్వహణ చేపట్టాలని, భారీ యంత్రాల పనిగంటలను రోజుకు కనీసం 16 గంటలకు పెంచేలా షిఫ్టుల వారీగా కార్యాచరణ ప్రణాళికలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కోల్ బెంచ్‌ను పరిశీలించిన ఆయన వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, బొగ్గులో మట్టి, బండరాళ్లు, ఇతర మలినాలు కలవకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఉత్పత్తితో పాటు కార్మికుల భద్రతకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, రక్షణ నియమాలు తప్పనిసరిగా పాటిస్తూ జీరో ప్రమాదాల లక్ష్యంతో పనిచేయాలని స్పష్టం చేశారు. డంపర్ సెక్షన్‌లో డ్రైవర్లు, ఆపరేటర్లు, మెకానిక్‌లతో మాట్లాడి వారి పని పరిస్థితులు, సమస్యలను తెలుసుకున్నారు. యంత్రాల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ మరమ్మతులను సకాలంలో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ప్రతి కార్మికుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో పీకేఓసీ ప్రాజెక్ట్ అధికారి బి. శ్రీనివాస చారి, డీజీఎం (సర్వే) ఎల్. దయాకర్, పీకేఓసీ4 మేనేజర్ డి. రమణారెడ్డి, పీకేఓసీ2 మేనేజర్ సురేశ్, జూనియర్ సర్వే అధికారి సర్వర్ నబీతో పాటు ఏరియా ఉన్నతాధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం



- *ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు*
- *మణుగూరు మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ*

దశ, మణుగూరు: నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మణుగూరు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో పినపాక నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఎలాంటి పైరవీలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నిజమైన నిరుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నామని పేర్కొన్నారు. ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.పట్టాలు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ విభాగం ఏఈ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్, జిల్లా నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రక్తదాతలే ప్రాణదాతలు: ఎస్ఐ రామన్ గౌడ్



దశ, చిన్నంబావి: సమాజంలో ప్రతి ఒక్కరి ప్రాణాలను కాపాడటానికి రక్తం ఎంతో అవసరమని, రక్తదానం చేసే వారే ప్రాణదాతలుగా నిలుస్తారని చిన్నంబావి మండల ఎస్సై రామన్ గౌడ్ అన్నారు.జిల్లా ఎస్పీ సునీత రెడ్డి పిలుపు మేరకు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల యువతకు రక్తదానం చేయాలని ఎస్సై పిలుపునివ్వగా, సుమారు 15 మంది యువకులు ముందుకు వచ్చారు. జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా పోలీస్ శాఖ, రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 15 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు.రక్తదానం చేసిన యువతకు పోలీస్ శాఖ, తెలంగాణ ప్రభుత్వ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలు అందజేశారు. యువత సమాజ సేవకు, ప్రజల సంక్షేమానికి ముందుకు రావాలని ఎస్సై రామన్ గౌడ్ పిలుపునిచ్చారు. రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎస్సై, యువతను జిల్లా ఎస్పీ సునీత రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది మహేందర్, వంశీ, జర్నలిస్టులు పెరుమాళ్ల శ్రీనివాస్, పెరుమాళ్ల వెంకటేష్, యువకులు కనమోని శివ, మేకల అశోక్, జింకల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.




ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మోడల్ స్కూల్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన
ఐదు రోజుల ఉద్యమ కార్యాచరణ ప్రారంభం

దశ, కామారెడ్డి: మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ MSJAC (మోడల్ స్కూల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం సదాశివనగర్ తెలంగాణ మోడల్ స్కూల్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఐదు రోజుల ఉద్యమ కార్యాచరణలో భాగంగా మొదటి రోజు ఉపాధ్యాయులందరూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తమ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 010 పద్దు ద్వారా నెలవారీ వేతనాలు చెల్లించాలని, మరణించిన ఉపాధ్యాయుల అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు కల్పించాలని కోరారు. అలాగే సర్వీస్ నిబంధనల ప్రకారం పదోన్నతులు కల్పించాలని, అర్హులైన టీజీటీ ఉపాధ్యాయులకు నోషనల్ ప్రయోజనాలు మంజూరు చేయాలని, హెచ్‌బీటీ ఉపాధ్యాయుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి, తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఐదు రోజుల ఉద్యమ కార్యాచరణలో భాగంగా తదుపరి దశల్లో మండల, జిల్లా స్థాయిల్లో నిరసనలు చేపట్టడంతో పాటు ప్రజాప్రతినిధులకు తమ సమస్యలను వివరించనున్నట్లు తెలిపారు.

ఆదివాసీల హక్కులను గౌరవించాలి

- *అడవుల సంరక్షణ అందరి బాధ్యత*
- *తుడుందెబ్బ నాయకులతో డీఎఫ్ఓ బాలమణి సమావేశం*




దశ, ఆసిఫాబాద్: ఆదివాసీల హక్కులు, చట్టాలు, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ అటవీ శాఖ అధికారులు పనిచేయాలని తుడుందెబ్బ నాయకులు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో డీఎఫ్ఓ బాలమణితో తుడుందెబ్బ ముఖ్య నాయకులు ప్రత్యేకంగా సమావేశమై ఏజెన్సీ ప్రాంతాల్లో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా 1/70, పెసా చట్టాలను గౌరవించాలని, ఆదివాసీ గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఆటంకాలు కల్పించవద్దని కోరారు. ఆదివాసీల ఆచారాలు, పండుగలు, పూజా కార్యక్రమాలకు అవసరమైన కట్టెల విషయంలో ఇబ్బందులు పెట్టకూడదని, అటవీ శాఖ నియామకాలు, కాంట్రాక్టు పనుల్లో స్థానిక ఆదివాసీలకు ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసీలకు అన్యాయం జరగకుండా చూస్తే అటవీ సంరక్షణలో శాఖకు పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. దీనిపై డీఎఫ్ఓ బాలమణి సానుకూలంగా స్పందిస్తూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు అడ్డంకులు ఉండవని, దైవ కార్యక్రమాలకు అవసరమైన కట్టెల వినియోగంపై అభ్యంతరం లేదని తెలిపారు. అయితే అటవీ సంపదను వ్యాపార ప్రయోజనాలకు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అటవీ సిబ్బంది వల్ల ఏవైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా తనకు ఫోన్ ద్వారా తెలియజేయాలని,విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అడవుల పరిరక్షణకు ఆదివాసీలు కూడా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ జాతీయ అధ్యక్షుడు కోట్నాక విజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్, ముఖ్య సలహాదారు కనక ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి పెందోర్ మారుతి, ఉపాధ్యక్షులు కొట్నక రాంశావ్, వెడ్మ భగవంత్ రావు, సిడాం నాగోరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన

డీసీసీ కార్యదర్శి జమాల్ షరీఫ్



దశ, జనగామ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుపై జనగామ పట్టణంలోని గిర్నిగడ్డ ఏక్ మినార్ మక్కా మసీదు వద్ద శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం ఓటరు నమోదు అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యదర్శి, అడ్వకేట్ మొహమ్మద్ జమాల్ షరీఫ్ మాట్లాడుతూ..వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు నిండిన ప్రతి పట్టభద్రుడు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యతని, ఒక్క ఓటు కూడా ఎన్నికల్లో కీలకమని పేర్కొన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదు గడువు నవంబర్ 6, 2026తో ముగియనున్నందున అర్హులైన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

దీపావళికి ముందే కూరగాయల ధరలు దిగువకు!



రైతుబజార్లలో అందుబాటు ధరలకు కూరగాయలు

హైదరాబాద్‌లో టమాటా రూ.27.. క్యాబేజీ రూ.11

దశ, హైదరాబాద్: దీపావళి పండుగకు ముందే కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టడంతో సామాన్యులకు ఊరట లభించింది. గత కొన్ని వారాలుగా పెరుగుతూ వచ్చిన ధరలు ప్రస్తుతం తగ్గడంతో గృహిణులకు ఉపశమనం కలుగుతోంది. బహిరంగ మార్కెట్లతో పోలిస్తే రైతుబజార్లలో కూరగాయలు తక్కువ ధరలకు లభిస్తున్నాయి. కూకట్‌పల్లి మోడ్రన్ అండ్ మోడల్ రైతుబజార్‌లో కిలో టమాటా రూ.27, వంకాయ రూ.18, బెండకాయ రూ.50, పచ్చిమిర్చి రూ.48, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.40, క్యాబేజీ రూ.11, క్యారెట్ రూ.45, కాలీఫ్లవర్ రూ.30, దొండకాయ రూ.23, బంగాళాదుంప రూ.23, ఉల్లిపాయలు రూ.40 చొప్పున విక్రయిస్తున్నారు. చిక్కుడుకాయ రూ.45, గోరుచిక్కుడు రూ.35, బీట్‌రూట్ రూ.25, క్యాప్సికం రూ.50, కీరదోస రూ.35, సొరకాయ రూ.20, పొట్లకాయ రూ.24గా ధరలు ఉన్నాయి. నిమ్మకాయలు డజను రూ.50 నుంచి రూ.60 వరకు పలుకుతున్నాయి. పండుగకు ముందు ధరలు తగ్గడం వినియోగదారులకు ప్రయోజనకరంగా మారింది. అయితే మార్కెట్, నాణ్యత, సరఫరాను బట్టి ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు.

23వ అంతస్తు నుంచి దూకి ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

కోకాపేటలో విషాదం.. తల్లి మందలించిందన్న మనస్తాపమే కారణమా?

ఇతర కోణాల్లోనూ నార్సింగి పోలీసుల దర్యాప్తు

దశ, హైదరాబాద్ : కోకాపేటలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న 15 ఏళ్ల విద్యార్థిని అపార్ట్‌మెంట్‌లోని 23వ అంతస్తు నుంచి దూకి ప్రాణాలు కోల్పోయింది. గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కోకాపేటలోని ప్రెస్టీజ్ బ్రౌలీ హిల్స్ అపార్ట్‌మెంట్స్‌లో వెంకటేశ్వర్లు కుటుంబం నివాసముంటోంది. ఆయన కుమార్తె లాస్య లహరి మాదాపూర్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గురువారం కళాశాలకు వెళ్లకపోవడంతో తల్లి మందలించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన లాస్య సాయంత్రం 7 గంటల సమయంలో అపార్ట్‌మెంట్ 23వ అంతస్తు నుంచి కిందకు దూకింది. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, తల్లి మందలింపే ఘటనకు కారణమా? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం వద్ద బార్లు, రెస్టారెంట్ల సంఘం నిరసన

దశ, హైదరాబాద్: రాష్ట్రంలో అక్రమ బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించాలని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం వద్ద సంఘం సభ్యులు నిరసన చేపట్టారు. పెంచిన ప్రివిలేజ్ ఫీజులను వెంటనే వెనక్కి తీసుకోవాలని, వ్యాపారులపై పడుతున్న అదనపు ఆర్థిక భారాన్ని తగ్గించాలని కోరారు. పర్మిట్ రూమ్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బెల్ట్ షాపుల వల్ల నిబంధనల ప్రకారం వ్యాపారం నిర్వహిస్తున్న బార్లు, రెస్టారెంట్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

నవంబర్ 30న తెలంగాణ ఓటర్ల తుది జాబితా

మరోసారి మారిన ప్రత్యేక ఓటర్ల సవరణ షెడ్యూల్

నవంబర్ 26 వరకు అభ్యంతరాల స్వీకరణకు గడువు పొడిగింపు



దశ, హైదరాబాద్: తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి మార్చింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి విజ్ఞప్తి మేరకు తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీని నవంబర్ 30గా నిర్ణయించింది. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు సంబంధించి క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువును నవంబర్ 26 వరకు పొడిగించింది. గత షెడ్యూల్ ప్రకారం నవంబర్ 9న తుది జాబితా విడుదల కావాల్సి ఉంది. అక్టోబర్ 29 నాటికి రాష్ట్రంలో జారీ చేసిన 92,88,188 నోటీసులకు గాను 92,81,189 నోటీసులను ఓటర్లకు అందజేశారు. వీటిలో 92,08,443 నోటీసులపై విచారణ పూర్తయింది. ఇప్పటివరకు 2,59,22,684 మంది ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చేందుకు అధికారులు ఆమోదం తెలిపారు. మరో 50,690 మంది ఓటర్లు అర్హులు కారని గుర్తించారు. ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రారంభానికి ముందు రాష్ట్రంలో 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, 73,39,235 మంది ఓటర్ల వివరాలను వలస, మరణం, చిరునామా మార్పు, నకిలీ ఓట్ల తదితర కారణాలతో పరిశీలన కోసం గుర్తించారు. సవరించిన షెడ్యూల్‌పై క్షేత్రస్థాయి అధికారులకు, రాజకీయ పార్టీలకు సమాచారం అందించాలని, ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రదానం

షాద్‌నగర్‌లో మార్వాడీ సమాజ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం.. 150 మందికి పైగా కార్మికులకు కొత్త దుస్తుల పంపిణీ

దశ, రంగారెడ్డి: దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని షాద్‌నగర్‌లో రాజస్థానీ మార్వాడీ సమాజ్ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రదానం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా 150మందికి పైగా కార్మికులకు కొత్త దుస్తులు పంపిణీ చేయగా, మహిళలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, షాద్‌నగర్ ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ, సీఐ సీతారాం, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. వారి సేవలను గుర్తించి పండుగ వేళ కొత్త దుస్తులు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. గత ఏడాది కూడా మార్వాడీ సమాజ్ ఆధ్వర్యంలో కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారని, ఈ ఏడాది కుట్టించిన దుస్తులను అందించడం సంతోషకరమని తెలిపారు. ప్రతి సంవత్సరం కార్మికులకు వస్త్రదానం చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న మార్వాడీ సమాజ్ సభ్యులకు మున్సిపాలిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. సమాజాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం శ్రమించే కార్మికులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

మియాపూర్ భూములు ప్రభుత్వానివే


550.39 ఎకరాలపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు

రూ.50-60 వేల కోట్ల విలువైన భూమి ప్రజా సంపద: కలెక్టర్ నారాయణరెడ్డి



దశ, హైదరాబాద్ : మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101 పరిధిలో ఉన్న 550.39 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. 1995 నుంచి కొనసాగుతున్న 19 కేసులను కలిపి విచారించిన సుప్రీంకోర్టు ఈ మేరకు తీర్పు వెలువరించిందన్నారు. ప్రస్తుతం ఈ భూమి విలువ సుమారు రూ.50 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్ల వరకు ఉంటుందని, ఇది ప్రజల ఆస్తి అని పేర్కొన్నారు. నిజాం కాలంలో సైనిక నిర్వహణ కోసం ఇచ్చిన జాగీర్ భూమిని 1912 రికార్డుల్లోనే సర్కారీ పోరంబోకుగా నమోదు చేశారని, 1949లో జాగీర్దారీ వ్యవస్థ రద్దుతో పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చిందని వివరించారు. నకిలీ పత్రాలు, రికార్డుల తారుమారుకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తీర్పు అనంతరం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం 550.39 ఎకరాల్లో సుమారు 400 ఎకరాలు ఖాళీగా ఉన్నాయని, ఈ భూమి హెచ్‌ఎండీఏ పర్యవేక్షణలో ఉందన్నారు.

రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో వన్‌వే!



ఐటీ కారిడార్‌లో 40 శాతం ట్రాఫిక్ తగ్గించడమే లక్ష్యం

జేఎన్‌టీయూ–ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మధ్య 30 ప్రత్యేక బస్సులు

దశ, హైదరాబాద్: హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా రాయదుర్గం జంక్షన్‌తో పాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మరో కీలక జంక్షన్ వద్ద వన్‌వే విధానాన్ని అమలు చేయనున్నారు. తొలుత వారం, రెండు వారాల్లో రాయదుర్గం వద్ద ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని ప్రారంభించి, ఫలితాలను సమీక్షించిన అనంతరం మరో జంక్షన్‌కు విస్తరించనున్నారు. ఈ మార్పులతో ట్రాఫిక్ రద్దీ 40 శాతం వరకు తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వన్‌వే అమలుతో వాహనదారులకు సుమారు రెండు కిలోమీటర్ల అదనపు ప్రయాణం మాత్రమే ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఉద్యోగులు, సందర్శకులకు ఇబ్బందులు కలగకుండా సమీపంలోని ఐటీ కంపెనీలు, వాణిజ్య సంస్థలు, మాల్స్, విద్యాసంస్థలకు ముందస్తు సమాచారం అందించనున్నారు. అదేవిధంగా పీక్ అవర్స్‌లో రద్దీ తగ్గించేందుకు ఆర్టీసీ సహకారంతో జేఎన్‌టీయూ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు కాంట్రా ఫ్లో ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో 20 నుంచి 30 ప్రత్యేక బస్సులను ఐటీ ఉద్యోగుల రాకపోకల కోసం అందుబాటులోకి తీసుకురానున్నారు. మరోవైపు పాదచారుల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా కీలక కూడళ్లలో స్కైవాక్‌ల నిర్మాణానికి కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాం

మొదటి పేజీ తరువాయి

అటవీ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నామని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకున్నామని చెప్పారు. ప్రభుత్వ భూములను విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయాన్ని విద్య, సాగునీరు, వైద్యం, ఇతర సంక్షేమ రంగాలకు వినియోగించాలని ఆలోచిస్తున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. ముఖ్యంగా విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ ప్రతిపాదనపై త్వరలో మంత్రివర్గంలో చర్చిస్తామని, వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయం, నిధుల వినియోగంపై సమగ్ర అధ్యయనం చేస్తుందని వివరించారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో భూముల కేసులను గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని కేసీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించారు. హరీశ్‌రావు మామ హన్మంతరావుపై కూడా ప్రభుత్వ భూముల ఆక్రమణ ఆరోపణలు చేశారు. మియాపూర్ భూములపై ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చిన నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు స్పందించాలని, ప్రభుత్వ భూముల పరిరక్షణపై అసెంబ్లీకి వచ్చి బహిరంగ చర్చలో పాల్గొనాలని సవాల్ విసిరారు.

ప్రభుత్వం కూలే వరకు పాదయాత్ర ఆపను

మొదటి పేజీ తరువాయి

విసిరారు. ఈ నెల 27న ఏదులాబాద్‌లోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈటల పాదయాత్ర ప్రారంభించారు. డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో పరిసర గ్రామాలు, కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గాలి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఆయన ఆరోపించారు. డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.

సబ్జెక్టులో ఫెయిలైనా పదో తరగతి పాస్ కావొచ్చు!

మొదటి పేజీ తరువాయి

మూల్యాంకనం నిర్వహించి కనీసం 33 శాతం మార్కులు సాధిస్తే ధ్రువీకరణ పత్రం ఇస్తారు. 202627లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠ్య ప్రణాళికలోనూ మార్పులు ఉంటాయని బోర్డు వెల్లడించింది. ఇందులో భాగంగా 'ఇండివిడ్యూవల్స్ ఇన్ సొసైటీ', కంప్యూటేషనల్ థింకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మాడ్యూళ్లు ఉండవని, 202728లో పదో తరగతికి వచ్చే ఈ బ్యాచ్‌కు పర్యావరణ విద్య కూడా వర్తించదని స్పష్టం చేసింది.

ఆస్ట్రేలియాకు తాండూరు కందిపప్పు!

మొదటి పేజీ తరువాయి

శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. భారత జీఐ ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎగుమతితో ఆస్ట్రేలియాలోని వినియోగదారులకు ప్రామాణికమైన భారతీయ వ్యవసాయ ఉత్పత్తి అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ పెరగడం రైతులు, ఎగుమతిదారులకు ప్రయోజనకరమని తెలిపారు. తాండూరు కందిపప్పుకు 2022 డిసెంబర్‌లో జీఐ గుర్తింపు లభించింది. తెలంగాణ నుంచి జీఐ ట్యాగ్ పొందిన తొలి పప్పుధాన్యపు పంట ఇదే. వికారాబాద్ జిల్లాలోని తాండూరు, పరిసర ప్రాంతాల్లో ఈ పంటను ప్రధానంగా సాగు చేస్తారు. అక్కడి నల్లరేగడి నేలలు ఈ పంటకు అనుకూలం. అధిక ప్రొటీన్ శాతం, ప్రత్యేకమైన రుచి, త్వరగా ఉడికే లక్షణాలు తాండూరు కందిపప్పుకు ప్రత్యేక గుర్తింపును తెచ్చాయి. తాజా ఎగుమతితో స్థానిక రైతులకు, వ్యాపారులకు మరిన్ని విదేశీ మార్కెట్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ఫోన్ మాట్లాడొద్దన్నందుకు

కన్నబిడ్డను హతమార్చిన తల్లి!

తరగతి చదువుతోంది. ఈ నెల 27న తల్లి, కుమార్తె మధ్య జరిగిన గొడవ తీవ్రం కావడంతో ఆగ్రహానికి గురైన తల్లి బాలికను గొంతునులిమి హత్య చేసింది. అనంతరం హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు బాలిక మెడకు చీర చుట్టి భర్తకు ఫోన్ చేసింది. బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తొలుత కడుపునొప్పితో ఆత్మహత్య చేసుకుని ఉంటుందని తండ్రి భావించినప్పటికీ, పోస్టుమార్టం నివేదికలో ఊపిరాడక మరణించినట్లు తేలింది. దీంతో అనుమానించిన పోలీసులు తల్లిని విచారించగా నేరాన్ని అంగీకరించింది. ఫోన్ ఎక్కువగా మాట్లాడుతోందని, తన మాట వినడం లేదనే కారణంతో హత్య చేసినట్లు తెలిపిందని డీసీపీ వెల్లడించారు.

ఆధార్, పాన్ కార్డుల్లో అక్రమ మార్పులు

జిరాక్స్ షాపు ముసుగులో నకిలీ కార్డుల తయారీ

షాపు నిర్వాహకుడు అరెస్ట్..

రూ.300 నుంచి రూ.1,000 వరకు వసూలు



దశ, రంగారెడ్డి: ఆధార్, పాన్ కార్డుల్లో పేర్లు, ఫొటోలు, పుట్టిన తేదీలు, చిరునామాలను అక్రమంగా మారుస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఈ వ్యవహారంలో జల్‌పల్లిలో జిరాక్స్ షాపు నిర్వహిస్తున్న సీహెచ్ మహాదేవ్ (36)ను టాస్క్‌ఫోర్స్, శంషాబాద్ జోన్ పోలీసులు అరెస్టు చేశారు. జల్‌పల్లిలో జిరాక్స్ షాపు ముసుగులో నకిలీ కార్డులు తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఆధార్ కార్డులో పుట్టిన తేదీ మార్పునకు రూ.300, పూర్తి వివరాల మార్పునకు రూ.700 నుంచి రూ.1,000 వరకు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ నకిలీ కార్డుల ద్వారా ఉద్యోగాలు పొందడం, సిమ్ కార్డులు తీసుకోవడం, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి తదుపరి విచారణ చేపట్టారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com